చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మండలంలోని మొదళ్లగూడ గ్రామ శివారులో ఉన్న సింబాయసిస్ యూనివర్సిటీలో శనివారం లా కళాశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి యతిరాజులు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు చట్టాలపై క్లుప్తంగా వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింబాయసిస్ కళాశాల డైరెక్టర్ సంతోష్ , సంపత్, బసవరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

-నందిగామ, జూలై 13

పరిహారం చెల్లించాలని కేంద్రమంత్రికి వినతి

మండలంలోని బండరావిరాల గ్రామ రెవెన్యూ సర్వేనం 268 మైనింగ్ జోన్‌లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ మండలాధ్యక్షుడు విష్ణు గౌడ్ ఆధ్వర్యంలో శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా అక్రమంగా మైనింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, వనపర్తి జిల్లా ఇన్‌చార్జ్ ప్రతాప్, సీనియర్ నాయకుడు పాపయ్యగౌడ్, మండల కిసాన్ మోర్చా ప్రధానకార్యదర్శి కొండల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య, ప్రేమ్, శ్రావణ్‌చారి, కుమార్‌గౌడ్, లింగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అనంతరెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు ఉన్నారు.

-అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 13

శివసేనారెడ్డికి సన్మానం

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ నూతన చైర్మన్‌గా శివసేనారెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

-కడ్తాల్, జూలై 13

మురుగుకాల్వలో ఆయిల్ బాల్స్..

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. ఆయన సూచనల మేరకు శనివారం మున్సిపల్ సిబ్బంది పలు వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లతో కలిసి మురుగు కాల్వల్లో ఆయిల్ బాల్స్‌ను వదిలారు. రాగన్నగూడ పరిధిలోని మురుగు కాలువలో ఆయిల్ బాల్స్ వదులుతున్న కౌన్సిలర్ ఉదయశ్రీ.

-తుర్కయాంజాల్, జూలై 13

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

సైబర్ నేరాలు, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆదిబట్ల ఠాణా పరిధి నాదర్‌గుల్‌లోని విజ్ఞాన్ హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్, పాఠశాల చైర్మన్, ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

-ఆదిబట్ల, జూలై 13

అప్రమత్తంగా ఉండాలి

మత్తు పదార్థాల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని ఏఐఎఫ్ డీవై రాష్ట్ర నిర్మాణ బాధ్యులు పెద్దారపు రమేశ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని స్టాలిన్ నగర్‌లో శనివారం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కర్ర రాజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత ఓట్లను కొల్లగొట్టడానికి ఉద్యోగ, ఉపాధి హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక పెట్టుబడిదారులు, కార్పొరేట్ వ్యక్తులకు రాయితీలు కల్పిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

-మాదాపూర్, జూలై 13

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల టౌన్, జూలై 13 : పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబుపేట మండలాలకు చెందిన 80 మందికి లబ్ధిదారులకు ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ సీఎంఆర్ఎఫ్ అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు వచ్చినందున తొందరలోనే పోలీసు అకాడమీ నుంచి మన్నెగూడ వరకు నాలుగులేన్ల బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. అదేవిధంగా ముడిమ్యాల నుంచి రావులపల్లి మీదుగా మేడిపల్లి వరకు రోడ్డు నిర్మాణ పనులకు రూ.24 కోట్ల మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, చేవెళ్ల గ్రామ మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, రాములు, పాండుయాదవ్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం

బదిలీపై వెళ్తున్న చేవెళ్ల గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవికి ఘన సన్మానం

రామాదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు

మొయినాబాద్, జూలై 13 : ఉద్యోగరీత్యా బదిలీలు సర్వసాధారణమని.. అంకితభావంతో పనిచేసే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికీ సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల/కళాశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ అన్నారు. తోలుకట్టా గ్రామ సమీపంలో ఉన్న చేవెళ్ల గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి బదిలీ సందర్భంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు ఆమెను, ఉపాధ్యాయుల బృందాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల గురుకుల పాఠశాలలో గత ఏడేండ్లుగా ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రమాదేవి.. స్కూల్ అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అంతేకాకుండా విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు గిరిబాబు, లక్ష్మణ్, శ్రీకాంత్, శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాళ్లు కల్పన, అమరావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు తైబజార్ వేలం పాట

చేవెళ్ల రూరల్, జూలై 13 : శంకర్‌పల్లి పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటల కు చికెన్ వేస్ట్ కలెక్షన్‌కు సంబంధించిన వేలం పాటకూడా నిర్వహిస్తున్నామని.. ఆసక్తి గల వారు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

యాచారం, జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జాబ్‌క్యాలెండర్‌ను ప్రకటించి వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పీఏసీఎస్ డైరెక్టర్ స్వరూప అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైనదన్నారు. నిరుద్యోగులపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో వివిధ కేటగిరిల్లో కొత్తగా ఉద్యోగాలు పొందిన వారికి వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలన్నారు.

వైద్య పరీక్షలు చేసి.. మందులు ఇచ్చి..

ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న సీఐ సత్యనారాయణ

ఇబ్రహీంపట్నం, జూలై 13 : నిత్యం ప్రజల క్షేమంకోసం పనిచేసే పోలీసులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఈశ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంప ట్నం పోలీసులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి.. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ రామకృష్ణ, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు

చేవెళ్ల రూరల్ : మండలంలోని ఊరెళ్ల, అనుబంధ గ్రామం మొండివాగులో శనివారం డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి దవాఖాన సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మందికి వివిధ రకా ల పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మేజర్ సమస్యలు ఉన్న వారిని పట్నం మహేందర్‌రెడ్డి దవాఖానకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో పట్నం మహేందర్‌రెడ్డి దవాఖాన వైద్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ఆమనగల్లు, జూలై 13 : మండలంలోని రాంనూంతల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పంతూ మాతృమూర్తి పాత్లావత్ కెస్లీ ఇటీవలే మరణించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి శనివారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి.. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీనూనాయక్, సుభాష్, చంద్రశేఖర్ రెడ్డి, సతీష్, వెంకటేశ్, రాజేందర్‌నాయక్, సుమన్ ఉన్నారు.

బోధనేతర పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్లటౌన్, జూలై 13 : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బోధనేతర పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్వేతారెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అటెండర్, డే వాచ్‌ఉమెన్ పోస్టులకు పదోతరగతి పాసై ఉండాలని, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారంతోపాటు అవసరమైన ధ్రువపత్రాలను జతపరిచి ఈనెల 20వ తేదీ లోపు పాఠశాల కార్యాలయంలో అందజేయాలని ఆమె సూచించారు.

కల్వర్టు నిర్మాణం.. నిలిచిన రాకపోకలు

- ప్రత్యామ్నాయ దారిని ఏర్పాటు చేయని కాంట్రాక్టర్
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు

నక్కలపల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డుపై నిర్మిస్తున్న కల్వర్టు

మొయినాబాద్, జూలై 13 : నక్కలపల్లి-వెంకటాపూర్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డుపై కల్వర్టు నిర్మాణం జరుగుతుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సాధారణంగా రోడ్డుపై కల్వర్టును నిర్మిస్తున్నప్పుడు వాహనాల రాకపోకలు నిలిచిపోకుండా ఉండేందుకు కల్వర్టు పక్క నుంచి తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేస్తారు. కానీ.. ఈ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ అలా చేయకుండా రోడ్డుకు అడ్డంగా పనులు చేస్తుండడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. దీంతో పాఠశాలల బస్సులు ప్రతిరోజూ తోలుకట్టా, ఎతుబార్‌పల్లి, నక్కలపల్లి వరకు వచ్చి తిరిగి మళ్లీ అదే గ్రామాలగుండా వెళ్లి హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి ఎక్కి కేతిరెడ్డిపల్లి, సజ్జన్‌పల్లి గ్రామాల్లోకి వెళ్లి విద్యార్థులను తీసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. దీంతో విద్యార్థులు పాఠశాలలకు ప్రతిరోజూ గంట ఆలస్యంగా వెళ్తున్నారని వారి తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. కాగా కల్వర్టు కోసం తవ్విన మట్టిని పక్కనే పోసి చదును చేశారు. అయితే ఇటీవల కురిసిన వానకు ఆ మట్టి చాలా మొత్తగా మారింది. ఓ వాహనం ఆ చదును చేసిన మట్టిపై నుంచి వెళ్లే ప్రయత్నంలో అందులో దిగబడిపోయింది. దీంతో ద్విచక్రవాహనాలు కూడా అటు నుంచి వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి అయ్యేందుకు మరో 15 రోజులు పట్టే అవకాశం ఉన్నది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణం జరుగుతున్న ప్రాంతం పక్క నుంచి తాత్కాలికంగా రోడ్డు వేసి వాహనాల రాక పోకలకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ప్రజ లు, వాహనదారులు కోరుతున్నారు.

ఇంటి నిర్మాణానికి స్టీల్, సిమెంట్ అందజేస్తున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు

పేదల ఇండ్ల నిర్మాణానికి చేయూత

కడ్తాల్ (తలకొండపల్లి), జూలై 13 : నియోజకవర్గంలోని నిరుపేదల ఇండ్ల నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చేయూత అందిస్తుందని ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన గుండెమోని బాలయ్య ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆయన స్టీల్, సిమెంట్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతయ్య, నాయకులు కోటేశ్వర్, రవికుమార్, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

శివారులో రౌడీషీటర్ల హల్‌చల్

ప్రశ్నించిన పోలీసులపై దాడికి యత్నం

నార్సింగి బృందావన్ కాలనీలో కలకలం

మణికొండ, జూలై 13: నగర శివారులో రౌడీషీటర్లు హల్‌చల్ చేస్తున్నారు. దశాబ్దకాలంగా రౌడీషీటర్ల మాటే వినపడని నగరంలో ఇప్పుడు వీరంగం సృష్టిస్తున్నారు. నార్సింగి మున్సిపాలిటీ బృందావన్ కాలనీలో ఓ ప్లాట్ కబ్జా విషయంలో కొంతమంది రౌడీషీటర్లు, యువకులు తిష్ట వేశారు. ఇటీవల మణికొండ మున్సిపాలిటీ పరిధికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు నరేందర్, అతడి స్నేహితుడు ప్రవీణ్ అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసిన పోలీసులు ఆ కేసు విచారణలో భాగంగా శనివారం బృందావన్ కాలనీకి వెళ్లారు. ప్లాట్ వివాదంలోనే వారు అదృశ్యమైనట్లు తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లారు. ఈ సైట్ ఎవరిది, ఇక్కడ మీరంతా ఎందుకు ఉన్నారని ప్రశ్నించిన పోలీసులపై అక్కడ ఉన్న రౌడీషీటర్లు, వారి అనుచరులు కత్తులు, హాకీ స్టిక్స్‌లతో పోలీసులపై దాడి చేసేందుకు యత్నించారు. అంతేకాక పోలీసుల పైకి బుల్ డాగ్స్(కుక్కలను) వదులుతామంటూ బెదిరించారు. ఒక్కసారిగా నార్సింగి పోలీసులు భయభ్రాంతులకు గురై.. పోలీసు బలగాలను అక్కడకు రప్పించారు. బలగాలను చూసిన వారు అక్కడ నుంచి పారిపోయేందుకు యత్నిస్తుండగా రౌడీషీటర్లు అహ్మద్ ఖాన్, షేక్ అమ్దాన్, మహ్మద్ జాఫర్, అమద్ మసూద్‌లను పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు. మరికొంత మంది కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు.

అసలు విషయం ఏంటంటే..?

శివారు ప్రాంతం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని బృందావన్ కాలనీలో ఓ ప్లాట్ విషయమై వివాదం చెలరేగుతున్నట్లు తెలిసింది. ఈ ప్లాట్ విలువ రూ.25 కోట్ల వరకు మార్కెట్‌లో పలుకుతుండగా ప్లాట్‌ను కబ్జా చేసే విషయంలో ఓల్డ్ సిటీకి చెందిన పలువురు రౌడీషీటర్లను అక్కడ తిష్ట వేయించి ఆక్రమిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇదే వివాదంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరేందర్, ప్రవీణ్‌ను సైతం కిడ్నాప్ చేసినట్లు.. వారి ఆచూకీ మూడు రోజులుగా తెలియక పోవడంతో కుటుంబ సభ్యులు నార్సింగి పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసు విషయంలో భాగంగా విచారణకు వెళ్లిన పోలీసులపై దాడికి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. కొన్ని రోజులుగా నార్సింగి మున్సిపాలిటీలో అక్రమార్కుల ఆగడాలు హెచ్చు మీరుతున్నాయి. ఈ వివాదాల విషయమై భూబాధితులు ఎవరు తమను ఆశ్రయించలేదని, వ్యక్తులు అదృశ్యమైన విషయంలోనే రౌడీ మూకల ఆగడాలు బయటకు వచ్చాయని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పోలీసులపై దాడికి యత్నించిన నలుగురిని అరెస్టు చేసి రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి న్యాయస్థానానికి తరలించామని, వారికి 7 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు.

బాధితులుంటే పోలీసులను ఆశ్రయించాలి

కొన్ని రోజులుగా నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో భూ వివాదాలు పెరుగుతున్నట్లు మా ప్రాథమిక విచారణలో తెలిసింది. భూవివాదాలు ఏమైనా ఉంటే న్యాయస్థానం ద్వారా తేల్చుకోవాలి. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బాధితులుంటే పోలీసులను ఆశ్రయించాలి **-హరికృష్ణ, ఇన్‌స్పెక్టర్**

గోల్కొండ బోనాల నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

సిటీబ్యూరో, జూలై 13 (నమస్తే తెలంగాణ): గోల్కొండ బోనాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు, ఆంక్షలు విధిస్తూ నగర పోలీసు కమిషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈనెల 14, 18, 21, 25, 28, ఆగస్టు 1, 4 తేదీల్లో గోల్కొండ బోనాల జాతర జరుగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా తేదీల్లో గోల్కొండ, పరిసర ప్రాంతాల్లో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలని సీపీ సూచించారు. అంతే కాకుండా బోనాల జాతరకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఇదిగో పార్కింగ్ స్థలాలు..

రామ్‌దేవ్‌గూడ వైపు నుంచి మక్కై దర్వాజా మీదుగా గోల్కొండకు వచ్చే భక్తులు తమ ఫోర్ వీలర్ వాహనాలను రామ్‌దేవ్‌గూడ ఏఓసీ సెంటర్‌కు ఎదురుగా ఉన్న మిలిటరీ గ్రౌండ్‌లో పార్క్ చేయాలి. ద్విచక్ర వాహనాలను గోల్కొండ వాల్ పక్కనే ఉన్న ఆషూర్‌ఖాన వద్ద పార్క్ చేయాలి.

- ☞ లంగర్‌హౌజ్ వైపు నుంచి ఫతే దర్వాజా మీదుగా గోల్కొండకు వచ్చే భక్తులు తమ ఫోర్ వీలర్ వాహనాలను అలంకార్ థియేటర్, దానికి ఆనుకుని ఉన్న ఓల్డ్ పెట్రోల్ పంప్ వద్ద పార్క్ చేయాలి. ద్విచక్ర వాహనాలను హుడా పార్క్ వద్ద పార్క్ చేయాలి.
- ☞ షేక్‌పేట, సెవన్ టూంబ్స్ మీదుగా గోల్కొండకు వచ్చే భక్తులు తమ ద్విచక్ర వాహనాలను గోల్ఫ్ క్లబ్ పార్కింగ్‌లో, మూడు, నాలుగు చక్రాల వాహనాలను డెక్కన్ పార్క్ వద్ద పార్క్ చేయాలి.
- ☞ పైన పేర్కొన్న మార్గాల్లో ఉదయం 8 నుంచి రాత్రి 11గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉన్నందున ఇతర వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

అలరించిన శ్రీరామ సంగీత మాధుర్యగానం

మాదాపూర్‌లోని అన్నమాచార్య బావనా వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభారాజు ఆధ్వర్యంలో శనివారం అన్నమాచార్య బావనా వాహిని విద్యార్థులతో కలిసి సంగీత కార్యక్రమం నిర్వహించారు. అన్నమ స్వరార్చన శ్రీరామ కర్ణాటక సంగీత పాఠశాల నుంచి గురువు జొన్నలగడ్డ మాధురి శిష్యబృందం కేశవ హరిచరణ్, స్వేచ్ఛారెడ్డి, తరుణ్ బాలాజీ, శ్రీకృతి, లితిక, శరణ్య, లలితాసౌజన్య సంకీర్తనలు ఆలపించారు. కళాకారులను డాక్టర్ శోభారాజు అభినందించి శాలువాలతో సన్మానించారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

- మాదాపూర్

పేదల బియ్యం.. పక్కదారి

భారీగా పట్టుబడ్డ పీడీఎస్ బియ్యం..

బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న నలుగురు సభ్యుల గ్యాంగ్ అరెస్ట్

వెంగళరావునగర్, జూలై 13 : పేదల బియ్యాన్ని అక్రమార్కులు తినేస్తున్నారు. గరీబోళ్ల ఆకలి తీర్చాల్సిన పేదల బియ్యం పక్కదారి పడుతున్నది. లబ్ధిదారుల ఇండ్లకెళ్లి తక్కువ ధరకు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి దళారులు తమ జేబులు నింపుకొంటున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు పీడీఎస్ బియ్యం స్థావరాలపై దాడులు నిర్వహించి.. నలుగురు సభ్యుల ముఠాను పట్టుకున్నారు. భారీగా పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన అబ్దుల్ రషీద్ (33) రహ్మత్‌నగర్‌కు చెందిన ఎండీ యాసిన్ (36), సర్పరాజ్ లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి తక్కువ ధరకు బియ్యం, గోధుమలను కొనుగోలు చేశారు. ఇలా కొన్న బియ్యాన్ని జవహర్‌నగర్‌కు చెందిన షానవాజ్ (35)కు విక్రయిస్తున్నారు. భారీగా పీడీఎస్ బియ్యం, గోధుమలను నిల్వ చేసిన స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. అక్రమంగా నిలువ చేసిన 96 బస్తాల్లో ఉన్న 4,950 కిలోల పీడీఎస్ బియ్యం.. 26 బస్తాల్లో ఉన్న 1,170 కిలోల గోధుమలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 6 టన్నులకుపైగా బియ్యం, గోధుమలను సీజ్ చేశామని పోలీసులు తెలిపారు. జవహర్‌నగర్‌కు చెందిన సయ్యద్ షానవాజ్ (35), అబ్దుల్ రషీద్ (33) రహ్మత్‌నగర్‌కు చెందిన ఎండీ యాసిన్ (36), సయ్యద్ సర్పరాజ్‌ల ముఠాను పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసును తదుపరి దర్యాప్తు నిమిత్తం మధురానగర్ పోలీసులకు అప్పగించారు. అర్హులైన పేదల నోట్లో మట్టికొట్టి బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే ఉపేక్షించేదిలేదని.. కఠినంగా వ్యవహరిస్తామని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డి హెచ్చరించారు.